www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 24 మే 2024
5
కాకినాడ



'వరుపుల'కు త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఏలేశ్వరం, పిఠాపురం

వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు ప్రమాదం తప్పింది. ఆయన తన కుమార్తె, అల్లుడితో కలిసి కారులో కాకినాడ వెళుతుండగా పిఠాపురం వద్ద గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆయన కారు వేరే కారును ఢీకొట్టింది. సకాలంలో బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు.



ప్రమాదానికి గురైన వరుపుల కారు

కౌలు రైతులపై చిన్న చూపు

- 1.50 లక్షల పైనే కౌలు సాగుదారులు
- సిసిఆర్ కార్డుల జారీలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- యజమాని సంతకం తప్పనిసరితో ఇక్కట్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రబీ పూర్తి కావస్తోంది. ఖరీఫ్‌కు సన్నద్ధతపై అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులకు మళ్లీ పంట సాగు హక్కు పత్రాలు అంటే సిసిఆర్ (క్రాప్ కల్టివేషన్ రైట్స్) ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వం మాత్రం కౌలు రైతుల పట్ల ప్రతిసారీ నిర్లక్ష్య ధోరణితోనే వ్యవహరిస్తోంది. అధికారులు సైతం అదే పంథాను అనుసరిస్తున్నారు. ఈ సారైనా కౌలు రైతులకు న్యాయం జరిగేలా సిసిఆర్ కార్డులను పూర్తిస్థాయిలో ఇస్తారా? లేదా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. అతి తక్కువ మందికి మాత్రమే సాగు హక్కు పత్రాలు అందుతుండడంతో ప్రభుత్వం ఇస్తున్న రుణాలు నామమాత్రంగానే ఉంటున్నాయి. సిసిఆర్ కార్డులు లేక రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పంట రుణాలు, పంటల బీమా వంటి పథకాలను కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులు అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నప్పుడు తీవ్ర నష్టాలకు గురై చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కాకినాడ జిల్లాలో పంటలను సాగు చేస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. అంటే జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా. 2019లో ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతు చట్టంతో వీరికి అన్యాయం జరుగుతోంది. సిసిఆర్ కార్డు ఉంటేనే ప్రభుత్వం పథకాలు ఇస్తామని చెబుతోంది. ఈ కార్డు ఇవ్వాలంటే భూ యాజమాని సంతకం తప్పనిసరి చేసింది. అనేక చోట్ల యజమానులు అందుకు ఒప్పుకోవడం లేదు. ఫలితంగా జిల్లాలో వేలాదిమంది కౌలు రైతులకు అన్యాయం జరుగుతోంది. 2023-24లో 54 వేల మందికి సిసిఆర్ కార్డులు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా తీసుకున్నారు. 56,322 మందికి ఇచ్చామని చెప్పుకొస్తున్నారు. మొత్తం కౌలు రైతుల్లో కేవలం 37 శాతం మందికి మాత్రమే సిసిఆర్ కార్డులు ఇవ్వగలిగారు. ఇంకా 63 శాతం మందికి అంటే ఇంకా 94 వేల మందికి కార్డులు ఇవ్వలేదు. లక్ష్యాన్ని నిర్దేశించడంలో అధికారులు ఏటా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం కౌలు రైతులకు శాపంగా మారింది. దీంతో ప్రభుత్వ పరంగా అందుతున్న పథకాలు వాస్తవ సాగుదారులకు కంటే భూ యజమానులకే అందుతున్నాయి. ఈ నేపథ్యంలో అనేకమంది ఏటా పెట్టుబడులు కోల్పోయి నష్టాలకు గురవుతున్నారు. పంటలకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. అప్పులు పెరిగిపోతున్నాయి. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. చివరకు కుటుంబ పోషణకు సైతం అవస్థలు తప్పడం లేదు. నివాసం ఉంటున్న ఇంటిని తాకట్టు పెడుతున్నారు. అప్పులు తీర్చలేకపోవడంతో మనస్థాపానికి గురై పలువురు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గడిచిన కాకినాడ జిల్లాలో రెండు నెలల వ్యవధిలోనే ఐదుగురు కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడటంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇలా ప్రభుత్వ నిబంధనలు ఒకపక్క, అధికారుల నిర్లక్ష్య ధోరణి మరోవైపు కౌలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ప్రభుత్వం ద్వారా అందాల్సిన పథకాలు అందకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో సిసిఆర్ కార్డులను జారీ చేసి ప్రభుత్వ అందిస్తున్న పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నియమావళి ప్రకారమే లెక్కింపు ప్రక్రియ

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నామని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్‌మీనా విజయవాడ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి పిఠాపురం నియోజకవర్గ ఆర్‌ఒ ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, సిబ్బందికి శిక్షణ, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, కౌంటింగ్ కేంద్రాల్లో కావలసిన ఇతర మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సిఇఒ ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మూడు అంచెల భద్రత, సిసి టివి కెమెరాలతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేశామని, జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్, ఫెన్సింగ్, బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ డాక్టర్ డి.తిప్పే నాయక్, తుని, ప్రత్తిపాడు, కాకినాడ రూరల్, కాకినాడ పట్టణం, జగ్గంపేట నియోజకవర్గాల ఆర్‌ఒలు, సిపిఒ పి.త్రినాథ్, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నివాస్

జెడ్‌పి సమావేశం నిరవధిక వాయిదా

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఎన్నికల నిబంధనల మేరకు నిరవధికంగా వాయిదా పడింది. 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలు జడ్‌పి అధ్యక్షులు విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన, 3వ స్థాయీ సంఘ సమావేశం స్థాయీ సంఘ చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం స్థాయీ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి అధ్యక్షతన, 6వ స్థాయీ సంఘ సమావేశం స్థాయీ సంఘ చైర్‌పర్సన్, జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన గురువారం జరిగాయి. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున,



ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశాలు నిర్వహించి ఏవిధమైన శాఖాపరమైన సమీక్షలు, తీర్మానాలు చేయకుండా, అమోదించకుండా సమావేశాలను ముగించారు. ఈ సమావేశంలో జడ్‌పి డిప్యూటీ సీఇఒ జివిఎస్.రాంగోపాల్, ఆయా జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్‌పి పరిపాలనాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుని హల్‌చల్

ప్రజాశక్తి - కాకినాడ

సెల్‌ఫోన్ దొంగతనం చేశావంటూ వేసిన నిందలను భరించలేక ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని రిస్క్ చేసి, ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేసిన యువకుడితో చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్యాయత్నాన్ని నిలువరించారు. పిఠాపురం రూరల్ మండలం చిత్రాడకు చెందిన ప్రదీప్‌కుమార్‌ను సెల్‌ఫోన్ దొంగతనం చేసావ్ అంటూ స్థానికులు నిందలు వేశారు. ఆ నిందలను తట్టుకోలేక ప్రదీప్ కుమార్ ఆత్మహత్య చేసుకోవాలని భావించి కాకినాడ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ టవర్‌పై ఎక్కి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో



హల్‌చల్ చేసిన యువకుడితో పోలీసులు

ఎస్ఐ ఎం.సాగర్‌బాబు సిబ్బందితో బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ దగ్గరకు చేరుకుని సమయస్ఫూర్తిగా వ్యవహరించి ఆ యువకుడికి ధైర్యం చెప్పి, నీపై పడ్డ నిందను లేకుండా చేస్తామని హామీ ఇచ్చి సురక్షితంగా కిందకు దింపారు. యువకుడి ప్రాణాలను కాపాడేందుకు చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐని, సిబ్బందిని స్థానికులు అభినందించారు. అనంతరం యువకుడికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.

26 నుంచి వేసవి వినోదం క్యాంపు నిర్వహణ

ప్రజాశక్తి - తాళ్ళరేవు

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి జూన్ 2 వరకూ చిన్నారులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ గుత్తుల మల్లేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సమ్మర్ క్యాంప్ కరపత్రాలను, క్లబ్ ప్రతినిధులు చిన్నారులతో కలిసి ఆవిష్కరించారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించేందుకు వారం రోజులపాటు నిర్వహించే పలు పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, ఆటలు, పాటల పోటీలు, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు, సీనియర్ జర్నలిస్టుల పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబూరావు, సుందరపల్లి సత్యనారాయణ, పాలిక శ్రీనివాస్, పులపకూర కృష్ణ, దిలీప్, జి.గురుశంకర్, కె.మల్లేష్, ఈశ్వరరావు, రాజబాబు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

'మానవతా విలువలను పెంపొందించుకోవాలి'

ప్రజాశక్తి - పిఠాపురం

హింస, తీవ్రవాదం, ఉగ్రవాదం నిర్మూలించేలా ప్రతీ ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించు కోవాలని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పట్టణంలోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన సభలో ఆలీషా మాట్లాడారు. ధర్మసూత్రాలను ఆచరించడం ద్వారా హింస, తీవ్రవాదం, ఉగ్రవాదం నిర్మూలింపబడే విధంగా మానవతా విలువలు పెంపొందించుకోవాలని హితవు పలికారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటి వాటిని సంరంక్షించాలని సూచించారు. అలాగే వేసవిలో పశు, పక్ష్యాదుల దాహార్తిని తీర్చే విధంగా ప్రత్యేక చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి విశ్వర్షి డాక్టర్ వాసిలి వసంత కుమార్ రచించిన జీవన సంహిత పుస్తకాన్ని, చిన్న సంకల్పం పెద్ద ఆశీస్సు గోడ పత్రిక, కరపత్రాన్ని, తత్వ జ్ఞానం హిందీ త్రైమాసిక మోడల్ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పక్షుల ఆహారం కొరకు తయారు చేసిన ధాన్యపు కుచ్చులను సభ్యులకు పంపిణీ చేశారు. ఆశ్రమ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్‌టివి.వర్మ, ఎవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.



జీవన సంహిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉమర్ ఆలీషా

ఇళ్లకు వెళ్లే దారేదీ..?

-మూతపడిన డివైడర్ దారులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఉన్నఫళంగా డివైడర్ దారులు మూసివేస్తే తమ వీధుల్లోకి ఎలా వెళ్లేది? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని పెద్దాపురం మెయిన్ రోడ్డులో ప్రసన్నఆంజనేయ స్వామి ఆలయం మొదలు విఘ్నేశ్వర థియేటర్ వరకూ ప్రధాన రహదారిలో వన్ వే అమలుకు రహదారుల మధ్య డివైడర్‌లను ఆర్ అండ్ బి అధికారులు ఏర్పాటు చేశారు. అయితే లారీ స్టాండ్ రోడ్డు మొదలు విఘ్నేశ్వర థియేటర్ వరకూ గణపతి నగరం, అయోధ్య రామపురం ప్రాంతాలకు వెళ్లే ప్రజల కోసం సుమారు 15 లింకు రోడ్డులున్నాయి. వాటికి సంబంధించి మెయిన్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌లకు ద్విచక్ర వాహనాలు రాకపోకలు జరిపేందుకు మార్గాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ మార్గాలకు అడ్డుగా టైర్ లు ఏర్పాటు చేసి, తాళ్ళు కట్టి ఎవరూ వెళ్లకుండా పూర్తిగా మూసివేశారు. దీంతో మెయిన్ రోడ్డు నుంచి గణపతి నగరం, అయోధ్య రామపురం ప్రాంతాలకు వెళ్ళాల్సిన ప్రజలు ఇటు మెహర్ కాంప్లెక్స్ వరకూ వచ్చిగాని, లేదంటే విఘ్నేశ్వర థియేటర్ వరకూ వెళ్లిగానీ మలుపు తీసుకుని వెళ్ళాల్సి వస్తుంది. ఈ కారణంగా తమకు సమయంతోపాటు తమ వాహనాలకు ఆయిల్ వృధా అవుతుందని వాపోతున్నారు. వీధులు ఉన్న చోట డివైడర్ కట్టింగ్‌లను ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేశారని, ఇలా వాటిని మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



డివైడర్ ల మధ్య మార్గాలను టైరులు పెట్టి మూసి వేసిన యంత్రాంగం

ఒరిగామి, గణితం, ఇంగ్లీష్‌పై మెళకువలు

ప్రజాశక్తి - కరప

జనవిజ్ఞాన వేదిక కరప మండ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇరిగామి, గణితం, ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. గురువారం భవన నిర్మాణ కార్మికుల భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వి.శ్రీరామారావు పాల్గొని మాట్లాడారు. ఒరుగామి గమ్ము లేకుండా పేపర్‌తో వస్తువులు తయారు చేయటం, గణితంలో మెలకువలు, ఇంగ్లీషులో కొన్ని అంశాలను విద్యార్థులకు వివరించారు. వేసవి వినోదం కార్యక్రమాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, ఆర్.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద కార్మికునికి పలువురి సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద కార్మికునికి మానవతావాదులు స్పందించి సాయం అందజేస్తున్నారు. తాళ్లరేవు పంచాయతీ రచ్చవారిపేటకి చెందిన పినపోతు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, మిత్ర బృందం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాధితుని తల్లి కామేశ్వరికి రూ.20 వేలు నగదు అందించారు. వీరితోపాటు బాధితుడు, తమ గ్రామస్తుడైన విజయ్‌కుమార్‌ను ఏవిధంగా అయినా రక్షించుకోవాలని రచ్చవారిపేట గ్రామమంతా ఏకమవుతుంది. గ్రామంలోని డ్వాక్రా మహిళలు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం అందజేస్తున్నారు. తాళ్లరేవు పరిరక్షణ సమితి వాట్సాప్ గ్రూపు నుంచి పలువురు సభ్యులు బాధితుని కుటుంబ సభ్యులకు ఫోన్ పే ద్వారా సుమారు రూ.15 వేలు అందజేశారు. దాతలకు బాధితుడి కుటుంబ సభ్యుడు రచ్చ కనకరాజు కృతజ్ఞతలు తెలిపారు.

24 మంది వికలాంగ బాలల గుర్తింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో కొత్తగా 24 మంది వికలాంగ బాలలను గుర్తించినట్లు ఐఇఆర్‌పిఎస్‌లు బి.దుర్గాప్రసాద్, బి.ఆనందరావు తెలిపారు. గురు వారం వారు మాట్లాడుతూ స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మే 1 నుంచి జూన్ 9 వరకూ నిర్వహిస్తున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో ఇప్పటి వరకూ 24 మందిని గుర్తించినట్లు చెప్పారు. మండలంలోని కొండపల్లి, మరలావ, చిన్నబ్రహ్మాదేవం, జె తిమ్మాపురం, గుడివాడ, పెద్దాపురం పట్టణ పరిధిలోని కొండయ్యపేట, మిరపకాయల వీధి, మంగళవారపుపేట, ఎన్‌టిఆర్ కాలనీలలో వీరిని గుర్తించామన్నారు. వీరిలో మానసిక వైకల్యం వారు 13 మంది, చలన వైకల్యం వారు ఇద్దరు, వినికిడి సమస్య వారు ముగ్గురు, మెదడు పక్షవాతం వారు ఇద్దరు, బహుళ వైకల్యం వారు నలుగురు ఉన్నారన్నారు. వీరందరిని జూన్‌లో భవిత సెంటర్‌లో చేర్పిస్తామన్నారు.



సర్వేలో ఐఇఆర్‌పిఎస్‌లు

విద్యార్థులకు కొనసాగుతున్న తరగతులు

ప్రజాశక్తి - కాకినాడ

10వ తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక తరగతులు గురువారం కొనసాగాయి. యుటిఎఫ్ సీనియర్ నేత సిహెచ్‌వి.రమణ లెక్కలు, కెఎంకె.మూర్తి సోషల్, గంగారాం తెలుగు సబ్జెక్టులను బోధించారు. ఈ సందర్భంగా సిహెచ్‌వి.రమణ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన క్లాసులు విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎ. వాసు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ కచేరిపేటలోని యుటిఎఫ్ హోంలో జరుగుతున్న తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 93462 64224, 78932 11869 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎ.సంజయ్, వంశీ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు మూర్తి

విద్యార్థులకు యోగాపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగపై శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు టి.సుబ్బారావు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థులు యోగాభ్యాసం చేయటం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు ఆర్ వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు స్పోకెన్ ఇంగ్లీష్‌లోనూ, నీతి పద్యాలు చదవడం, బాలలతో పాడించడంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లయ్య, పాఠకులు కాటమరాజు, వై.రాజేష్, బి.అరవిందకుమార్, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పౌర్ణమి వేడుక

ప్రజాశక్తి - తాళ్లరేవు


మండలంలోని పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ పవిత్ర వైశాఖ పౌర్ణమి పర్వదినం సందర్భంగా గురువారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి సత్యశ్రీనివాసాచార్యులు ముత్యాలమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా చొల్లంగిపేట గ్రామానికి చెందిన నరాల అప్పారావు, లక్ష్మీ రుక్మిణి దంపతులచే క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యన్నారాయణ, పితాని వీరబాబు, శెట్టి దొరబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి పితాని సత్యవతి పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై సమీక్ష

ప్రజాశక్తి - రౌతులపూడి, గండేపల్లి

2024-25 ఖరీఫ్ సాగుకు సంబంధించి ముందస్తు చర్యలపై గురువారం సమీక్షా సమావేశం జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, ఆర్గానిక్ ఫర్టిలైజర్స్, పచ్చిరొట్టను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి గోపీనాథ్, సచివాలయ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గండేపల్లి మండలం వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశం మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్ర వ్యవసాయ శాఖ అధికారు సంజీవ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు వినియోగం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వినియోగించాలన్నారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గించడంతోపాటు భూమి సంరక్షణ కల్గుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ నీటిబోరు కింద వరి పండించే రైతులు ఇతర పంటలను సాగు చేసేందుకు దృష్టి సారించాలన్నారు. 3 ఏళ్ల వయసులోపు ఉండే ఆయిల్ పామ్ తోటలలో అంతరపంటలుగా చిరుధాన్యాలు, అపరాలు సాగుచేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట బందోబస్తు

-144 సెక్షన్ అమలు చేయాలి
-పోలీసులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలని, కౌంటింగ్ రోజున ప్రణాళిక ప్రకారం ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, ఎస్‌పి ఎస్.సతీశ్‌కుమార్, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పోలీస్, ట్రాఫిక్, రోడ్డు భవనాల శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జూన్ 4న జెఎన్‌టియులో నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో చేపట్టాల్సిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, డిస్ ప్లే బోర్డులు, అభ్యర్థులు, ఏజెంట్లు వాహనాల పార్కింగ్, జిల్లాలో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ రోజున ప్రణాళిక ప్రకారం ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యల తలెత్తకుండా పగడ్బందీగా 144 సెక్షన్ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేసినట్లు ఎస్‌పి ఎస్.సతీశ్‌కుమార్ తెలిపారు. జెఎన్‌టియులో తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్, కాకినాడ పట్టణం, జగ్గంపేట నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులు, ఏజెంట్లు వాహనాల పార్కింగ్ నిమిత్తం జెఎన్‌టియుకెకి ఎదురుగా ఉన్న ఐటీఐ, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోను, పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి స్థానిక జిల్లా క్రీడామైదానంలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. భద్రత సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పాస్‌లు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఆయా కూడళ్లలో డిస్ ప్లే బోర్డులు, మైక్ అనౌన్స్మెంట్ ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ పట్టణంలో కౌంటింగ్ రోజున ట్రాఫిక్ మళ్లింపుకు సంబంధించిన రూట్ మ్యాప్, బందోబస్తు వివరాలు, బారికేడ్ల ఏర్పాటు వంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్, వివిధ నియోజకవర్గాలకు చెందిన ఆర్‌ఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులు, ఆర్‌ఒలతో సమీక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి నివాస్

వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలి: కమిషనర్



తాగునీటిని శుద్ధిచేసే ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ నుంచి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వేడి చేసి తాగాలని కమిషనర్ జాస్తి రామారావు తెలిపారు. గురువారం వేసవి జలాశయం, ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు. గత 20 రోజులుగా కుళాయిల్లో పసరు రంగులో తాగునీరు సరఫరా అవుతోంది. దీనిపై మీడియా లోనూ కథనాలు వచ్చాయి. దీంతో స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ చెరువును, ఫిల్టర్ బెడ్ పనితీరును కమిషనర్, మున్సిపల్ ఎఇ, ఇతర అధికారులు పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ చెరువులో పసరు రంగులో ఉన్న జాలాలను వారు పరిశీలించారు. అలాగే ఆ జలాలను శుద్ధిచేసే పద్ధతిని అధికారులు పరిశీలించి జలాలలో కలుపుతున్న ఆలమ్, క్లోరిన్ శాతాలపై సిబ్బందిని ప్రశ్నించి వారికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కమీషనర్ రామారావు మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో జలాలు ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో నాచుపట్టి పసరు రంగులోకి మారినట్టు చెప్పారు. ఫిల్టర్ బెడ్ వద్ద అవసరానికి మించి ఆలమ్, క్లోరిన్‌లు ఉన్నప్పటికీ పరిమితిని మించి అధికంగా వాటిని వినియోగిస్తే ఆ నీరు త్రాగే ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదముం దన్నారు. నీటిని ఎంత శుద్ధిచేసినా పసరు కొంచెం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు కుళాయిల్లో వచ్చే నీటిని కొద్ది రోజులపాటు కాచి, చల్లార్చి తాగాలని ఆయన సూచించారు.

నేరాలు ఘోరాలు

మోసం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - కాకినాడ

చిట్ కట్టించుకుని తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఇద్దరు నిందితులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే 2016లో కాకినాడ అపోలో ఆసుపత్రి దగ్గరలో దుర్గా రాధిక చిట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బ్రాంచ్ నడిపిన పైలా నాగేశ్వర రావు, పైల పవన్‌కుమార్ జగన్నాధ పురానికి చెందిన కాళే సత్యవతిలక్ష్మి దగ్గర రూ.10 లక్షల చిట్ వాయిదాల రూపంలో కట్టించుకున్నారు. అన్ని వాయిదాలూ కట్టాక ఆమెకు చిట్ డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతో ఆమె నాగేశ్వరరావు, పైల పవన్ కుమార్‌లపై ఆమె టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ముద్దాయిలను అరెస్టు చేసి చార్జిషీట్ ను దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ పిపి జి.కమలకుమారి వాదనలు వినిపించారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని శీల గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు దగ్ధమైంది. స్థానికులు రెవెన్యూ అధికారి వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం తాటాకు ఇంటిలో నివసిస్తుంది. గురువారం ఉదయం లక్ష్మీకాంతం ఉపాధి పనికి వెళ్ళిపోయింది. ఉదయం 7 గంటల సమయంలో లక్ష్మీకాంతం ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆ మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా ఆమె తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో రూ.40 వేల నగదుతోపాటు కాసు బంగారం, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైందని, నష్టం రూ.1.50 లక్షలు వరకూ ఉంటుందని విఆర్ఒ వీరభద్రరావు తెలిపారు.

కాలువలో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి సమీపంలో ఉన్న ఏలేరు ఎడమ కాలవ వద్ద గురువారం మృతదేహం లభించింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన సికోలు వీరబాబు(38) బుధవారం తన స్నేహితులతో ఓ వివాహానికి హాజరై తిరిగి ప్రయాణంలో ఏలేరు కాలువలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తన సిబ్బందితో గాలించగా గురువారం మృత దేహాన్ని ఏలేరు కాలువలో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోయిన దృశ్యం

ఆర్‌టిసి బస్సు, ట్రాక్టర్ ఢీ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆర్‌టిసి బస్సు, ట్రాక్టర్ ఢీకొట్టు కున్నాయి. గురువారం ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కుడి వైపునకు తిరుగుతున్న బస్సుకు పెద్దాపురం వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ రోడ్డు మధ్య లో అడ్డుగా రావడంతో రెండు వాహనాలు ఢీ కొట్టు కున్నాయి. ప్రమాదంలో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి.

పత్రాలు సరిలేని 5 బైకులు సీజ్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కాకరపర్రులో గురు వారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా 5 బైకులను పత్రాలు సరిగ్గాలేని కారణంగా సీజ్ చేసినట్టు ఎస్ఐ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, పత్రాలు లేని వాహనాలను వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

పురుగుల మందు తాగిన యువకుడు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఈనెల 18వ తేదీన రామచంద్ర పురం గ్రామానికి చెందిన పెనుగుల అబ్బులు(27) అదే గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అపస్మారక పరిస్థితిలో పడి పోయి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పురు గుల మందు తాగాడని గుర్తించి అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం రాజహేంద్రవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. అయితే మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలిం చారు. ఐదు రోజులుగా చికిత్స పొం దుతున్న ఆ యువకుడి ఆరోగ్యం విషమించి గురువారం మృతి చెందాడు. పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

ఎస్ఇబి దేవరపల్లి స్టేషన్ పరిధిలో గురువారం మండలంలోని యాదవోలు గ్రామం లో చేసిన దాడిలో 20 లీటర్ల నాటుసారా తోపాటు ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడు ల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి. - కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెం గ్రామ శివారు చైతన్యనగర్ రైల్వే గేట్ దగ్గర్లో అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్న కొప్పిశెట్టి రామకృష్ణను అరెస్టు చేసినట్లు కడియం పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 100 లీటర్ల నాటు సారా, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి, కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, పేకాటలు, సారాయి, మద్యం అమ్మకాలు, సారాయి తయారు చేసిన, అలాగే ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడి మృతిపై అనుమానాస్పద కేసు నమోదు

ప్రజాశకి - ఆత్రేయపురం

ఒక యువకుడి అనుమానస్పద మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన కైరం నాగ శ్రీనివాస్‌కు(34) వివాహం కాలేదు. తన తండ్రి పోతురాజుతో కలిసి ప్రతి రోజు పొలం పనులు చేసుకుంటూ తిరిగి వస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో బుధ వారం సాయంత్రం ఎప్పటిలాగే పొలం పనులు చేసుకుని ఇంటికి వచ్చారు. అనంతరం తనొక్కడే తిరిగి అదే రోజు రాత్రి బయటకు వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో తల్లి ఆ యువకుడికి ఫోన్ చేశారు. ఇంటికి వచ్చేస్తానని సమాధానం చెప్పాడు. అయితే ఇంటికి మాత్రం రాలేదు. తెల్లవారి గురు వారం ఉదయం తండ్రి పోతురాజు పొలం పనులకు వెళుతుండగా గ్రామ శివారున తన కొడుకును స్పృహ లేకుండా పడి ఉండడం చూసి గ్రామ పిఎంపి వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించాడు. తన కుమారుడు శ్రీనవాస్ ఆత్మహత్య చేసుకునే వాడు కాదని ఎవరో తన కుమారుడిని హతమార్చి ఉంటారని అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఎస్ శ్రీనివాస్ అమలాపురం నుంచి డాగ్ స్క్వాడ్, క్లూ టీమ్స్ రప్పించి పలు ఆధారాలను సేకరించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



ఆశ్రమం వద్ద సరుకులు అందిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దాపురంలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో రూ.25 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ జరిగింది. ఆదిత్య కళాశాల విద్యార్థులు తమ తమ గృహాల నుంచి బియ్యాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఈ విధమైన సేవా కార్యక్రమంలో భాగస్వాములు అవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు బి.రాంబాబు, ఐవి.వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునికి ఘన సత్కారం



వీరభద్రరావు దంపతులకు సత్కారం చేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీర భద్రరావు సాధించిన హ్యాట్రిక్ విజయం సామర్లకోట పట్టణానికే తలమానీకం అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం రాత్రి సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూడోసారి కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా విజయం సాధించిన ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి దంపతులకు ఆత్మీయ అభినందన కార్యక్రమం జరిగింది. లయన్స్ అధ్యక్షులు కానుబోయిన విజయ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రెసిడెంట్ చిత్తులూరి వీర్రాజు, సినీ దర్శకులు కెబి.ఆనంద్ మాట్లాడారు. ప్రజా సేవలో ఎల్లవేళలా ముందుండి అవసరాల్లో ఉన్న వారికి చేదోడుగా ఉంటున్న న్యాయవాదులు కొర్లమండ దంపతుల సేవలు అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ అధ్యక్ష పదవిని అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సన్మానగ్రహీత వీరభద్రరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీస్సులు, జీవిత భాగస్వామి, కుటుంబం సహకారంతో తాను ఇప్పటి వరకూ ఎన్నో విజయాలు, సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వీరభద్రరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి బడుగు సీతా రామరాజు, నాయకులు మేకా శ్రీనివాస్, సేపేని సురేష్, కర్రి ఆదినారాయణ రెడ్డి, గుండు శంకర రావు, ప్రత్తి రామ లక్ష్మణమూర్తి, అందుగుల జార్జిచక్రవర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డిఇ రత్నాలరావు తెలిపారు. 11కెవి సూరంపాలెం ఫీడర్, సూరంపాలెం ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతులతోపాటు, 11కెవి లైన్‌పై ఉన్న చెట్లు కొమ్మలను తొలగించడం జరుగుతుందన్నారు. కావున శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సూరంపాలెం, రామేశ్వరంపేట యర్రంపాలెం గ్రామాలతోపాటు, సూరంపాలెం అగ్రికల్చర్ బోర్లు, సూరంపాలెం పరిశ్రమలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన వెల్లడించారు.

వృథాగా పోతున్న తాగునీరు



పైపు నుంచి లీక్ అవుతున్న తాగునీరు

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజల అవసరాల కోసం సరఫరా చేస్తున్న తాగునీరు వృథాగా పోతుంది. గత కొన్ని రోజులుగా ఈ తంతు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడాన్ని పలువురు తప్పుపడు తున్నారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో బావవరం వద్ద ఏలేరు నీటిని శుద్ధి చేసి మండలంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. గోవిందపురం గ్రామానికి వెళ్ళే పైపు లైన్ లీకు అవుతూ నీరు ఉవ్వెత్తున ఎగసి పడుతుంది. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే వారు ఆ నీటితో తడిచి ముద్ద అవుతున్నారు. ఇలా ఫిల్టర్ వాటర్ పైపు లైన్ గ్రామ మొదట్లో లీకు అవ్వడంతో గోవిందపురం గ్రామానికి నీరు అందడం లేదు. పైపులైన్ నిర్వహణ కాంట్రాక్టర్ లీకులు అరికట్టక పోవడంతో నీరు సరిపోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం ప్రజలు సంబంధిత అధికారులకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం ఉండటం లేదు. అధికారులు స్పందించి పైపులైన్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టి గోవిందపురం గ్రామానికి పూర్తి స్థాయిలో తాగునీటిని అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు నిషేధం



అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న సిఐ

ప్రజాశక్తి - గండేపల్లి

ఎన్నికల కోడ్ ఉన్నందున కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లను నిషేధించినట్లు సిఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామ పెద్దలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం గండేపల్లి గ్రామ శివారు రంగంపేట పోవు రోడ్డులో ఉన్న ఆర్క్ఫైర్ వర్క్స్‌ను సందర్శించారు. ప్రస్తుతం 144, సెక్షన్ 30 అమలులో ఉందని, జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలకు అనుమతులు లేవన్నారు.

బిసిసిఐ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - గండేపల్లి

పర్యావరణ పరిరక్షణ కోసం బిసిసిఐ చేస్తున్న కృషి అభినందనీయమని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మీడియా మేనేజర్, జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఐపిఎల్-24 క్రికెట్ టోర్నీ ప్లే ఆఫ్‌లో ప్రతీ డాట్ బాల్‌కి 500 మొక్కలు నాటడానికి నిర్ణయం స్వాగతనీయమని అన్నారు. ఐపిఎల్ ద్వారా ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలనే పిలుపు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు.

కౌంటింగ్ నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జెఎన్‌టియులో జూన్ 4న జరిగే పెద్దాపురం నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్‌ఒ జె.సీతారామారావు కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వారి కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారన్నారు. 15 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్యాలయం ఎఒ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు పద్మావతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లపై చెత్త వేస్తే జరిమానా'

ప్రజాశక్తి - కాకినాడ

చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా తప్పదని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు హెచ్చరించారు. గురువారం ఆయన ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. అలాగే ఇంటింటికి చెత్త, తడి పొడి చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పూడికతీత పనులను వేగవంతం చేశామన్నారు. వర్షాలు పడే లోపుగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. డీ-సిల్టేషన్ పనులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమేరాల ఏర్పాటు

▸ రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.తేజ్‌భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్ట్రాంగ్ ల వద్ద రెండు సిపి కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటినీ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్ భరత్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్ల పై రాజకీయ పార్టీల, అభ్యర్ధుల రెవిన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ని పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఇవిఎమ్ యూనిట్స్ భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, పోస్టల్ బ్యాలెట్ లు, స్టాట్యూటరీ మెటీరియల్ భద్రపరిచే క్రమంలో పక్క పక్కనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 13 పోలింగు ప్రక్రియ ముగిసిన అనంతరం ఇవిఎమ్ యూనిట్స్, స్టాట్యూటరీ మెటీరియల్ , పోస్టల్ బ్యాలెట్ పత్రాలు స్ట్రాంగ్ రూమ్ లకి భద్రపరచి అభ్యర్థుల, వారి ప్రతినిధుల సమక్షంలో సీల్ వేశామని అన్నారు. అదే విధంగా ఆ మూడు రూములకి కూడా డోర్, కిటికీ లను చెక్కలను కొట్టి మూసి ఉంచామన్నారు. ఓట్లు లెక్కించే జూన్ 4 వ తేదీ ఉదయం 5 గంటలకి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. ఆలోగా తప్పనిసరిగా హాజరు కావాలని పరిశీలకులు వారి సమక్షంలో ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బంది టేబుల్ ఎలాట్ మెంట్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. స్ట్రాంగ్ ల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటినీ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణా చేస్తున్నట్లు తెలిపారు. అక్కడ అభ్యర్థులు, ఏజెంట్స్ నిరంతరం పరిశీలించడం జరుగుతుందనీ అన్నారు. శుక్రవారం నుంచి అభ్యర్థులు, ఏజెంట్స్ నేరుగా స్ట్రాంగ్ రూమ్ లను తనిఖీ చేసే అవకాశం ఉందని, ఆమేరకు పోలీస్, గేజిటెడ్ అధికారి ఎస్కార్ట్ తో పంపనున్నట్లు తెలియ చేశారు. మూడు షిఫ్ట్ లలో తహశీల్దార్లు ను నియమించినట్లు తెలిపారు. నియోజక వర్గం లో 3,033 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పి ఎస్.శ్రీధర్

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లో సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా సమావేశం గురువారం నిర్వహించారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించి వారికున్న సందేహాలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నివత్తి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా అత్యంత పారద ర్శకంగా నిర్వహించుటలో తమ వం తు సహకారం అందించాలని ఎన్నికల్లో పోటీ లో ఉన్న అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రతిని ధులను కోరారు. సార్వత్రిక ఎన్నికలకు సంబం ధించి మొదటి ఘట్టం పోలింగ్ జిల్లా లో ప్రశాంతంగా ముగిసిందని అం దుకు రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ వంతు సహకారం తోడ్పాటు అందించారన్నారు. అదే స్ఫూర్తిని ఓ ట్ల లెక్కింపు ప్రక్రియలో జిల్లా యంత్రాంగానికి అందించి కౌంటింగ్ ప్రక్రి యను కూడా విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల పోలింగ్ రోజున పోలింగ్ అనంతరం పలు జిల్లాలలో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటన నేపథ్యంలో ఎన్నికల సంఘం భద్రత చర్యలను మరింత కట్టుదిట్టం చేసిందన్నారు. అటువంటి చర్యలు పునరావతం కాకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావు గా జరగడానికి ప్రతి ఒక్కరు సహా య సహకారాలు అందించాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో పారదర్శకం గా నిర్వహించడానికి అన్ని చర్యలతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కౌంటింగ్ కొరకు ఎటువంటి ఫిర్యాదులు లేని సమర్ధవంతమైన అధికార సిబ్బందిని నియమించామన్నారు. సిస్టం సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఇవిఎంలు ద్వారా కౌంటింగ్‌లో పెద్దగా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేవన్నారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కౌంటింగ్ సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు ర్యాండమైజేషన్ ప్రక్రియతో విధులు కేటాయించామన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం ఏడు గంటలకే స్ట్రాంగ్ రూములను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరుస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6:30 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు సంతప్తి చెందిన తరువాతనే తదుపరి ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని స్వయంగా పరిశీలించుకునేందుకు అభ్యర్థులు కూడా హాజరుకావాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శ కంగా పనిచేస్తున్నది లేనిదీ కేవలం పోటీలో ఉన్న అభ్యర్థి పరిశీలించు కునే అవకాశం లేనందున ఆయన తరపున ఏజెంట్లు స్వయంగా పరిశీ లించుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందిని 25శాతం రిజర్వులో ఉంచామనిస్పష్టం చేశారు. ప్రాధాన్యత క్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారీగా కౌంటింగ్ ఏజెంట్లకు సిట్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఏజెంట్లు ప్రతి రౌండు నివేదికలో తప్పనిసరిగా సంతకాలు చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పోస్టల్ బ్యాలెట్ , సర్వీస్ ఓటర్ల ఓట్ల లెక్కింపు సంబంధించి రెండు చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. వీటిలో ఒక టేబుల్ పోస్టల్ బ్యాలెట్ కొరకు రెండవది సర్వీస్ ఓటర్ల కొరకు ఏర్పాటు చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ సర్వీస్ ఓటర్లు, ఇవిఎంల్లో ఓట్లు లెక్కింపు సమాంతరంగా జరుగు తుందని ఆయన స్పష్టం చేశారు ఇదే సరళిలో పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్ల ఓటింగ్ లెక్కింపు కొరకు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి టేబుల్ కు రౌండ్ కు 500 ఓట్లు చొప్పున పోస్టల్ బ్యాలెట్ లెక్కించే విధంగా ఏర్పాటు చేశామన్నా రు ఒక టేబుల్ కు కేటాయిం చిన ఏజెంట్ మరో టేబుల్ లోని వివరాలు సేకరణకు ప్రయత్నించ రాదన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఆర్‌ఒతో పాటు సహాయ రిటర్నింగ్ అధికారి, సూక్ష్మ పరిశీలకులు, గెజిటెడ్ స్థాయి సూపరింటెండెంట్ వారికి సహాయ కులుగా విఆర్‌ఒలు ఉంటారన్నారు. ఇసిఐ మార్గద ర్శకాల ప్రకారం ఒక సైడుగా ఏ పని జరగదని అంతా అత్యంత పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో సిబ్బం ది తప్పిదాలు చేస్తే ఎన్నికల సంఘం తీసుకుని చర్యలు, శిక్షలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. కౌంటింగ్ నిరంత రాయంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లావ్యా ప్తంగా 819 సర్వీస్ ఓటర్లు ఉండగా వీరిలో ఇప్పటివరకు 262 మంది సర్వీస్ ఓట్లు వినియోగించుకు న్నారన్నారు. మిగిలినవారు విని యోగించుకునే సమయం ఇంకా ఉందన్నారు. యువత ఎన్నికల ప్రక్రియలో హింసాత్మక సంఘటన లకు పాల్పడి తమ భవిష్యత్తును అంధకారం చేసుకోరాదని ఆయన సందర్భంగా హితవు పలికారు.

జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి మొదటి ఘట్టం పోలింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి ఒకవైపు తీసుకున్న ముందస్తు జాగ్రత్తచర్యలు తోపాటు గా మరోవైపు రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థులు మంచి సహకారం అందించారన్నారు. ఇదే పంథాను, స్ఫూర్తిని కౌంటింగ్ ప్రక్రియ లోను కొనసాగించి ప్రశాంత వాతా వరణంలో ఎన్నికల ప్రక్రియను ముగించడానికి తోడ్పాటునందించాలని కోరారు. స్ట్రాంగ్ రూములో వద్ద సెక్యూరిటీ పరంగా సెంట్రల్ పారా మిలటరీ దళాలు ఆయుధాలతో సహా భద్రత కల్పిస్తున్నాయన్నారు. రెండో దశలో రాష్ట్ర ఆర్మీడ్ పోలీస్ బలగాలు మూడో దశలో సివిల్ పోలీసులు మూడంచెల భద్రత కల్పిస్తారన్నారు. కౌంటింగ్ సెంటర్ కి వచ్చే వాహనాల ను చెక్ చేసి అనుమతిస్తామన్నారు. ఇసిఐ మార్గదర్శ కాలు ప్రకారం అత్యంత భద్రతను పాటిస్తున్నట్లు వెల్లడించారు. ఫలితాలు అనంతరం గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలు ఊరేగింపులు పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు అదేవిధంగా బాణసంచా కాల్పులు, లూజు పెట్రోల్ అమ్మకాలు పై నిషేధం ఉం దన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోనికి ధ్రువీకరించబడిన పాస్లు జారీ చేసిన కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. కళాశాల చుట్టుపక్కల స్టైరైన్ జోన్‌గా ప్రకటించామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని ఎవరు గుంపులుగా గుమిగూడ రాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి ఈ మహత్తర కార్యక్రమా న్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. గతంలో పరిస్థితులు వేరని ప్రస్తుతం ఎన్నికల సంఘం నిర్ణయించిన మార్గదర్శకాలు అందుకు భిన్నంగా ఉన్నా యన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడి ఇబ్బందికర పరిస్థితులు సృష్టించేందుకై ఎవరు ప్రయత్నించరాదనిస్పష్టం చేశారు. ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నామని అన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద మీడియా సెంటర్ ను ఏర్పాటు చేసి రెగ్యులర్గా మానిటరింగ్ చేస్తామన్నారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం నిఘా చర్యలు కొనసాగు తాయన్నారు. 214 సిసి కెమెరాలు ఏర్పాటుచేసి ప్రక్రియను చిత్రీకరిస్తామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలకు భరోసాను కల్పించేందుకై కవ్వింపు చర్యలు హింసాత్మక సంఘటనలకు పాల్పడ కుండా తమ వంతు సహకారం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఏడు నియోజకవర్గాల ఆర్వోలు ప్రజా ప్రతిని ధులు పాల్గొన్నారు.